

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు'

తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.


సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శుక్రవారం 13 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 51 | పేజీలు : 04, వెల రూ.2

ఏపీకి మరో భారీ పెట్టుబడి.. రూ.800 కోట్లతో

ఆస్ట్రోబేస్ రాకెట్ టెస్టింగ్ కేంద్రం విస్తరణ



ఏపీలో రూ.800 కోట్ల పెట్టుబడికి ఆస్ట్రోబేస్ స్పేస్ ఒప్పందం

విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీఈడీబీతో ఎంవోయూ


శ్రీ సత్యసాయి జిల్లా తిమ్మసముద్రంలో 360 ఎకరాలకు కేంద్రం విస్తరణ

లీయూజబుల్ లాంచ్ వెహికల్స్, హాట్ ఫైర్ పరీక్షల నిర్వహణకు అవకాశం

ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి

అమరావతి : విశాఖపట్నం వేదికగా జరుగుతున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ అంతరిక్ష రంగ పెట్టుబడి లభించింది. మిగతా..2లో

తెలంగాణాలో 21 మంది ఐపీఎస్ ల బదిలీలు..



తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్ నూతన సీపీగా మహేష్ భగవత్ నియామకం

ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్ బదిలీ

లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్

పోలీస్ శాఖలో సమూల మార్పులు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు . 1654) జారీ చేశారు. మిగతా..2లో

ఖండాంతరాలకు అరకు కాఫీ ఘుమఘుమలు - వాల్‌మార్ట్‌తో మంత్రి లోకేశ్ కీలక చర్చలు



- అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేలా మంత్రి లోకేశ్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.
- స్థానిక ఉత్పత్తులకు వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్‌లలో చోటు కల్పించాలని ప్రతిపాదించారు.

అమరావతి : రాష్ట్రంలోని గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

- ఏపీలో టూరిజం, సెమీకండక్టర్, గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పునరుత్పాదక ఇంధనంతో పాటు మరెన్నో రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయన్ని వాటిని పెట్టుబడిదారులు వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.
- విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న చంద్రబాబు

అమరావతి: ఏపీలో టూరిజం, సెమీకండక్టర్, గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పునరుత్పాదక ఇంధనంతో పాటు మరెన్నో రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయన్ని వాటిని పెట్టుబడిదారులు వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. తన నాయకత్వంలో సుమారు 8 సీఐఐ భాగస్వామ్య సదస్సులు నిర్వహించామన్న సీఎం, తమపై నమ్మకంతో ఎందరో

రాష్ట్రంలో పెట్టుబడులకు సువర్ణావకాశం



పెట్టుబడిదారులు రాష్ట్రానికి వచ్చినట్లు వివరించారు. ఇప్పటి వరకు 32.49 లక్షల కోట్ల రూపాయల విలువైన ఎంవోయూలు కుదుర్చుకున్నామని సీఎం స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకురాబోతున్నట్లు వివరించారు. తిరుపతి స్పేస్ సిటీ ఈ సంస్కరణలకు వేదిక కాబోతోందన్నారు. దేశంలోనే అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో కల్పిస్తున్నామని వాటన్నింటినీ పెట్టుబడిదారులు వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఇప్పుడు సువర్ణావకాశం అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అద్భుతమైన టూరిజం సర్క్యూట్‌లకు భారీ అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆరు ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయని, అదనంగా మరో 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రెండు ఫిషింగ్ హార్బర్లు ఉన్నాయని, అదనంగా మరో 7 ఫిషింగ్ హార్బర్ల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు "ప్రస్తుతం నూతన సాంకేతికతకు మిగతా..2లో

ఏపీ నమ్మకమైన ప్రాంతం - పెట్టుబడిదారులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న పవన్ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందన్నారు.
- 150కి పైగా ఒప్పందాలు కుదుర్చుకోవడమే లక్ష్యమన్నారు.



అమరావతి : పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన ప్రాంతం అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న పవన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందన్నారు. 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న బలమన్నారు. కాకినాడలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో 15 ఎంవోయూలు కుదుర్చుకున్నామని పవన్ వివరించారు. నేటి సదస్సులో 150కి పైగా ఒప్పందాలు కుదుర్చుకోవడమే లక్ష్యమని తెలిపారు. ఉపాధి కల్పనలో ఏపీ ముందుందన్న పవన్ పెట్టుబడిదారులు ఇక్కడి అవకాశాలను అందిపు చ్చుకోవాలని పిలుపునిచ్చారు. సాంకేతికతను అందిపు చ్చుకుంటున్న మిగతా..2లో

శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయాలి

ఆకస్మిక దాడులను తిప్పికొట్టేలా ఉండాలి

- శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయడంతో పాటు,
- ఆకస్మిక దాడులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు.



ఢిల్లీ : ఆధునిక యుద్ధ తంత్రంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా త్రివిధ దళాలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయడంతో పాటు, ఆకస్మిక దాడులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. దిల్లీలో జరిగిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ముప్పు ముంచుకు రాకముందే గుర్తించేలా నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేయాలని, శత్రువు ప్రతిస్పందించేలోపే విరుచుకుపడే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని రాజ్ నాథ్ సింగ్ సూచించారు. నేటి కాలంలో యుద్ధాలు కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా ఎలక్ట్రానిక్, సైబర్, అంతరిక్ష రంగాలకు విస్తరించాయని వివరించారు. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, గగనతల రక్షణ వ్యవస్థలు అత్యంత కీలకంగా మారాయని చెప్పారు. కాముకాజీ డ్రోన్లు, కౌంటర్-డ్రోన్ ఆపరేషన్ల కోసం ప్రత్యేక విధానాలను రూపొందించాలన్నారు. త్రివిధ దళాల మధ్య సమన్వయం, సంయుక్త కార్యాచరణ భవిష్యత్ సైనిక ప్రణాళికలకు పిలుపునిచ్చారు. మిగతా..2లో

బీజేపీ అడ్డుకోవడమే టార్గెట్

కొత్త కూటమి ఏర్పాటు చేసిన ఒవైసీ, ఆజాద్



- ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ
- కాన్షీరామ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ కలిసి 'సామాజిక పరివర్తన మోర్చా'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఢిల్లీ : 2027 ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీకి వ్యతిరేకంగా కొత్త కూటమి ఏర్పాటైంది. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ- కాన్షీరామ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ కలిసి 'సామాజిక పరివర్తన మోర్చా'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కూటమి తరపున యూపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్‌ను ఒవైసీ ప్రకటించారు.

రూ.7 కోట్లు ఇవ్వకుంటే కేజ్రీవాల్ ను చంపేస్తాం'

దిల్లీ మాజీ సీఎంకు బిష్ణోయ్ గ్యాంగ్ వార్నింగ్!

- ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి.
- గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరుతో ఈ బెదిరింపు ఫోన్ కాల్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.



ఢిల్లీ : ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపింది. రూ.7కోట్లు ఇవ్వాలని లేకుంటే కేజ్రీవాల్ ను ఆయన కుమార్తెను చంపేస్తామని బెదిరించారు. అయితే, ఆ ఘటనకు పాల్పడింది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అని పంజాబ్ పోలీసులు పేర్కొన్నారు. దిల్లీలోని తిలక్ నగర్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులకు దర్యాప్తు చేపట్టారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడినంటూ ఇటీవల తనకు ఓ వ్యక్తి ఫోన్ చేశారని జర్నైల్ సింగ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్ కాల్ అనంతరం వాట్సప్ సందేశాలు కూడా పంపినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే ఫిర్యాదు ప్రకారం,

"నేను లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి మాట్లాడుతున్నా. రూ. 7 కోట్లు ఇవ్వాలని అరవింద్ కేజ్రీవాల్‌కు చెప్పు. లేదంటే కేజ్రీవాల్‌ను, ఆయన కుమార్తె హర్షిత కేజ్రీవాల్‌ను చంపేస్తా" అని నిందితుడు బెదిరించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరోవైపు, అరవింద్ కేజ్రీవాల్ ఒక ప్రముఖ వ్యక్తి కావడంతో, ఈ బెదిరింపు జాతీయ, ప్రజా భద్రతకు ముప్పుగా మారిందని జర్నైల్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరగకముందే మిగతా..2లో

22`A నిషేధిత భూ సమస్యలకు

శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యం



- 22-ఎ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.
- ఈ మేరకు సచివాలయంలో పలు జిల్లాల కలెక్టర్లతో సమావేశమైన మంత్రి..
- 22-ఎ భూ సమస్యలపై కీలక ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, నవంబర్ 12: 22-ఎ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో సమావేశమయ్యారు. కాగా.. నిషేధిత భూముల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు పలు సూచనలు చేశారు.

ఇక నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు..

వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట



తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన సీఎం

- చెరువు విస్తరణ కోసం 2 ఎకరాల స్థలాన్ని అందించిన నటుడు నాగార్జున
- 14 ఎకరాలకు కుంచించుకుపోయిన తమ్మిడి కుంటను 30 ఎకరాలకు విస్తరించిన ప్రభుత్వం
- నగరంలో చెరువుల పరిరక్షణతో పాటు లేక్ ఎకానమీని ప్రోత్సహిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటన
- మూసీ నది పునరుజ్జీవనం ద్వారా నల్గొండ జిల్లా ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని హామీ

'హైదరాబాద్: 'నిన్నటి వరకు అందరూ శిల్పారామం గురించే మాట్లాడుకున్నారు.. కానీ ఇవాళ్టి నుంచి తమ్మిడి కుంట గురించే మాట్లాడుకుంటారు. ఇకపై ఐటీ ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' కాదు.. 'వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' అంటారు" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నగరంలో ఆధునికీకరించిన తమ్మిడికుంట చెరువును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతమందికి తాత్కాలికంగా నష్టం జరిగినా, రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతోనే తమ్మిడికుంటను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, ఇప్పుడు 30 ఎకరాల విస్తీర్ణానికి పెంచినట్లు వివరించారు. మిగతా..2లో

బెస్ట్ క్లీన్ సిటీగా నిలిచిన జీహెచ్ ఎంసీ -

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు



- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో హైదరాబాద్ ఉత్తమ స్వచ్ఛ నగరంగా ఎంపికైంది.
- రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి అవార్డు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

హైదరాబాద్ : తెలంగాణలో ఉత్తమ స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ ఎంసీ) నిలిచింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో హైదరాబాద్‌కు దక్కిన ఈ అవార్డును బుధవారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీకర్ణన్‌లు అందుకున్నారు. జాతీయ స్థాయిలో మెంటార్-మెంటీ సిటీస్, స్వచ్ఛ నగరాల లీగ్, 10 లక్షలకు పైగా, 3 నుంచి మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

ఏపీకి మరో భారీ పెట్టుబడి.. రూ.800 కోట్లతో ఆస్ట్రోబేస్ రాకెట్ టెస్టింగ్ కేంద్రం విస్తరణ

ప్రముఖ ప్రైవేట్ స్పేస్ టెక్నాలజీ సంస్థ ఆస్ట్రోబేస్ స్పేస్ టెక్నాలజీస్, రాష్ట్రంలో రాకెట్ టెస్టింగ్, లాంచ్ వెహికల్ అభివృద్ధి మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు రూ.800 కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ తో సంస్థ గురువారం అవగాహన ఒప్పందం (వీశీఖ) కుదుర్చుకుంది. ఈ విస్తరణ ప్రాజెక్టు ద్వారా శ్రీ సత్యసాయి జిల్లా తిమ్మసముద్రంలో ప్రస్తుతం ఉన్న రాకెట్ ఇంజిన్ టెస్టింగ్ కేంద్రాన్ని సంస్థ మరింత పెద్ద ఎత్తున విస్తరించనుంది. ప్రస్తుతం దాదాపు 22 ఎకరాల్లో ఉన్న ఈ సదుపాయానికి అదనంగా మరో 339 ఎకరాలను చేర్చనున్నారు. దీంతో ఈ టెస్టింగ్ కేంద్రం మొత్తం విస్తీర్ణం సుమారు 360 ఎకరాలకు చేరుకుంటుంది. భారత ప్రైవేట్ అంతరిక్ష రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించనుంది. ఈ పరిణామంపై ఆస్ట్రోబేస్ స్పేస్ టెక్నాలజీస్ సీఈఓ, కో-ఫౌండర్ నీరజ్ ఖండేల్‌వాల్ స్పందిస్తూ.. భారతదేశం నుంచే అత్యాధునిక అంతరిక్ష రవాణా వ్యవస్థలను నిర్మించే తమ ప్రయత్నాలలో ఈ విస్తరణ ఒక కీలక మైలురాయి అని తెలిపారు. విస్తరించిన ఈ మౌలిక వసతుల ద్వారా స్టాటిక్ హాట్-ఫైర్ టెస్టులు, స్టేజ్-లెవల్ హాప్ టెస్టులు వంటి అత్యంత సంక్లిష్టమైన ప్రయోగాలను నిర్వహించవచ్చని ఆయన వివరించారు. అంతేకాకుండా పునర్వినియోగ రాకెట్ టెక్నాలజీ (రీయూజబుల్ లాంచ్ వెహికల్స్) అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలు, సాంకేతికతలో భారత్ ఇప్పటికే తన సత్తాను నిరూపించుకుందని, భవిష్యత్తులో ఉపగ్రహాలు, పేలోడ్లను మరింత తరచుగా, విశ్వసనీయంగా నింగిలోకి చేరవేయడమే తదుపరి లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా దాదాపు 500 మందికి ప్రత్యక్షంగా, మరో 1,000 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కాగా, బెంగళూరులో ఎవరెస్ట్ ఇంజిన్, ూదీ220 మీడియం-లిఫ్ట్ లాంచ్ వెహికల్ అభివృద్ధికి అవసరమైన అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు కోసం కర్ణాటకలో రూ.500 కోట్ల పెట్టుబడి ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ఆస్ట్రోబేస్ ఈ తాజా ఒప్పందం చేసుకోవడం గమనార్హం. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ సంయుక్తంగా ఏపీ ప్రభుత్వ ఆతిథ్యంలో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఏపీలో 28 వేల మందికి ఫ్లిప్‌కార్ట్ ఉపాధి : ఏపీ నుంచి ఏటా 6.5 కోట్ల పొండ్లకు పైగా రొయ్యలు కొనుగోలు చేస్తున్నామని పాల్ డైక్ ఈ సందర్భంగా తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ పెట్టుబడులతో రాష్ట్రంలో 28 వేలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వెల్లడించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ఉద్యోగాలు లభించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని వందకు పైగా లాజిస్టిక్స్ హబ్‌ల ద్వారా తమ సేవలు అందిస్తున్నామని వివరించారు. ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి రాష్ట్రంలో 3,200 కు పైగా ఎంఎస్ఎంఈలకు శిక్షణ ఇచ్చామన్నారు. వాటిలో 900 కు పైగా సంస్థలను తమ మార్కెట్‌ప్లేస్‌లో చేర్చినట్లు పాల్ డైక్ తెలిపారు. లేపాక్షి ఉత్పత్తుల ఎగుమతిపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఇక నుంచి వర్క్‌ఫ్రమ్ హోమ్ కాదు..

వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట

చెరువుల ఆక్రమణలతోనే కాలనీలు జలమయం

హైదరాబాద్ నగరం అంటేనే 'రాక్స్ అండ్ లేక్స్ సిటీ' అని సీఎం గుర్తుచేశారు. గతంలో నగరంలో 1372 చెరువులు ఉండేవని, కానీ వివిధ కారణాలు, ఆక్రమణల వల్ల దాదాపు 50 శాతం చెరువులు కనుమరుగైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను కబ్జా చేయడం వల్లే కొద్దిపాటి వర్షం పడినా రోడ్లపైకి నీళ్లు రావడం, కాలనీలు చెరువులను తలపించడం జరుగుతోందని.. ఈ దుస్థితిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. వందేళ్ల క్రితమే మూసీ వరదల నుంచి నగరాన్ని రక్షించడానికి నిజాం పాలకులు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించారని, ముచుకుందా నది.. మూసా, ఈసా సంగమంతో మూసీగా రూపాంతరం చెంది నదీ నాగరికతకు కేంద్రంగా మారిందని గుర్తుచేశారు.

మూసీ ప్రక్షాళన ఆగదు..

బాధితులకు అండగా ఉంటాం

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూసీ తీవ్రంగా కలుషితమైందని, ఆ విషపు నీటి ప్రభావంతో నల్లగొండ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా తీవ్ర అనారోగ్యాలతో శిక్ష అనుభవిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మూసీ పునరుజ్జీవనం చేపట్టాలని సంకల్పించామని చెప్పారు. "మూసీకి కావాల్సింది కేవలం బాహ్య సుందరీకరణ కాదు.. దానికి పూర్తిస్థాయి పునరుజ్జీవం కల్పించడమే మా లక్ష్యం. ఈ ప్రక్రియలో ఏ ఒక్కరికీ అన్యాయం లేదా నష్టం జరగకుండా ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుంటుంది. త్వరలోనే మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులను ప్రారంభిస్తాం" అని వెల్లడించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడాలని, నగరాభివృద్ధి కోసం అన్ని పక్షాలూ రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

'లేక్ ఎకానమీ' అభివృద్ధికి పెద్దపీట

నగరంలోని చెరువులను కాపాడుకుంటూనే వాటి చుట్టూ 'లేక్ ఎకానమీ'ని ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తమ్మిడికుంట ప్రాంగణంలో ప్రజలకు పూర్తి భద్రత ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే చెరువు ఆవరణలో ఒక జమ్మి చెట్టును నాటాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించారు. అలా చేస్తే దసరా వంటి సంప్రదాయ వేడుకలకు చెరువులు కేంద్ర బిందువులుగా మారి, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

బెస్ట్ క్లీన్ సిటీగా నిలిచిన జీహెచ్ ఎంసీ

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రదానం

10 లక్షలు, 50 వేల నుంచి 3 లక్షలు, 20 వేల నుంచి 50 వేలు, 20 వేలలోపు జనాభా, నదీ, సముద్ర తీరం, హిమాలయ ప్రాంత నగరాల కేటగిరీల్లో తొలి 3 స్థానాల్లో నిలిచిన పట్టణ స్థానిక సంస్థలకు భారత రాష్ట్రపతి ముర్ము అవార్డులు ప్రదానం చేశారు. అర్హత ఉన్న విభాగాల్లో ఏ కేటగిరీలోనూ తెలంగాణ తొలి మూడు స్థానాలను దక్కించుకోలేకపోయింది.

10 ప్రధాన అంశాల ఆధారంగా

రాష్ట్ర స్థాయి ఉత్తమ నగరాల్లో మాత్రం తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి శుద్ధి, ఇళ్ల నుంచి చెత్త సేకరణ, నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం వంటి 10 ప్రధాన అంశాల ఆధారంగా చేపట్టిన మూల్యాంకనంలో జీహెచ్ఎంసీ మెరుగైన ఫలితాలను సాధించింది. పారిశుద్ధ్యం విషయంలో చేర్యాల, మంథని మున్సిపాలిటీలకు మెంటార్‌గా వ్యవహరించి వాటి పనితీరును మెరుగుపరిచింది.

పరిశుభ్రత విషయంలో

ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలి

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడారు. నగరాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దే విషయంలో ప్రజల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తన ప్రజా జీవిత ప్రస్థానం పంచాయతీలో స్వచ్ఛతా కార్యక్రమం ద్వారానే ప్రారంభమైందన్న ముర్ము, ఈ రంగంలో అందరూ గుర్తించదగ్గ మార్పు తీసుకురావాలంటే అధికార వ్యవస్థ ప్రజలతో కలిసి పని చేయాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల క్షేత్రస్థాయి అనుభవాలనూ పరిగణనలోకి తీసుకొని, వాటిని ఆచరణలో పెట్టాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సర్వేలు

స్వచ్ఛ భారత్ మిషన్ ఫలితాలు మరింత వేగంగా అందుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వాలూ ఇదే విధంగా రాష్ట్రస్థాయిలో సర్వే నిర్వహించి మంచి పనితీరు కనబరిచిన మున్సిపాలిటీలకు అవార్డులు అందజేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సూచించారు.

22- నిషేధిత భూ సమస్యలకు

శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యం



'22-ఎ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి. 22-ఎ దరఖాస్తులన్నీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదు. పరిష్కారంలో జాప్యం చేస్తే సహించేది లేదు. ఈ మేరకు కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ప్రత్యేక చొరవ చూపాలి. ప్రతి వారం 22-ఎ భూ సమస్యలపై జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించాలి. పరిష్కారం కాని సమస్యలను ఉన్నతస్థాయి కమిటీకి పంపాలి. యూఎల్‌సీ సమస్యలపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలి. జీవో 59, 76, 118 అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. దాంతోపాటు.. 22-ఎ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు చర్యలు చేపట్టండి. వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించండి. అర్హులైన భూ యజమానులకు త్వరితగతిన న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలి. అయితే.. ప్రభుత్వ భూముల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించండి' అని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఏపీ నమ్మకమైన ప్రాంతం - పెట్టుబడిదారులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మొదటి పేజి తరువాయి



రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పవన్‌కల్యాణ్ అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని పవన్ తెలిపారు. 'మీకు సరైన లక్ష్యం ఉంటే ఏపీ దాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సహాయం అందిస్తుంది. మీ దగ్గర మంచి ఆలోచన ఉంటే దాన్ని అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునందిస్తుంది. భవిష్యత్తును నిర్మించాలన్న సంకల్పం ఉంటే ఆంధ్రప్రదేశ్ మీకు తోడుగా ఉంటుంది' అని పవన్ కల్యాణ్ పెట్టుబడిదారులకు స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తల కలలను, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలను నిజం చేసేందుకు ప్రభుత్వం భాగస్వామిగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. 'విశాఖలోని ఈ సదస్సు సరికొత్త ఆలోచనలు,పెట్టుబడులకు వేదికయ్యింది. మనం భవిష్యత్తు గురించి మాట్లాడటానికి కాదు, కలిసికట్టుగా భవిష్యత్తును నిర్మించడానికి ఇక్కడ సమావేశమయ్యాం. టెక్నాలజీ ఖండాంతరాలు దాటి ప్రయాణించగలదు, క్షణాల్లో మార్కెట్ విలువలు మారిపోతాయి కానీ నమ్మకం మాత్రమే అందర్నీ ఒకచోటికి చేర్చగలదు. ఆ నమ్మకం ఆంధ్రప్రదేశ్ ఇస్తుంది. ఈ 31వ సీఐఐ సమ్మిట్ ద్వారా దేశవిదేశాల్లోని వివిధ సంస్థలకు ఏపీలో పెట్టుబడులు పెట్టే అవకాశం దక్కుతుంది. ఈ పెట్టుబడులు రాష్ట్రంలోని వేల మందికి ఉపాధి అందించడం సహా ఏపీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయి.' -పవన్ కల్యాణ్, ఉపముఖ్యమంత్రి ప్రజల జీవితాల్లో మార్పు రావాలి: పెట్టుబడిదారులకు పూర్తి భద్రత కల్పించడంతో పాటు వేగంగా అనుమతులు మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను కూడా అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కేవలం ఉత్పత్తి సామర్థ్యాన్నే కాకుండా వినూత్న ఆలోచనలు, యువత ప్రతిభను నమ్మి పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. పర్యావరణానికి, ప్రకృతికి నష్టం కలగకుండా పారిశ్రామిక కార్యకలాపాలు సాగించాలని కోరారు. పెట్టుబడుల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల జీవితాల్లో మార్పు రావాలని స్పష్టం చేశారు.

ఖండాంతరాలకు అరకు కాఫీ ఘుమఘుమలు - వాల్‌మార్ట్‌తో మంత్రి లోకేశ్ కీలక చర్చలు

మొదటి పేజి తరువాయి



ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ద్వారా స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్ తీసుకురావాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ పలువురు పారిశ్రామికవేత్తలతో కీలక చర్చలు జరిపారు. గిరిజన ప్రాంతాల్లో పండే అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ప్రీమియం కాఫీని విదేశీ మార్కెట్లకు భారీగా సరఫరా చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఎస్ఎల్ఎన్ కాఫీ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదించారు. విశాఖలో ఎస్ఎల్ఎన్ కాఫీ చైర్మన్ ఎన్. శతప్పన్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మిడిల్ ఈస్ట్, యూరప్, ఆగ్నేయాసియా, రష్యా లాంటి కీలక అంతర్జాతీయ మార్కెట్లకు అరకు కాఫీని సరఫరా చేయాలని కోరారు. కాఫీ ప్రాసెసింగ్, మార్కెటింగ్, పంపిణీ కోసం ఏపీ గిరిజన కార్పొరేషన్‌తో కలిసి పని చేయాలని మంత్రి సూచించారు. ప్రధాన నగరాల్లో లెవిస్టా కేఫ్‌లు : రాష్ట్రంలోని జాతీయ రహదారుల వెంబడి లెవిస్టా కేఫ్‌లను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ కోరారు. విశాఖపట్నం, విజయవాడ, అమరావతి, తిరుపతి లాంటి ప్రధాన నగరాల్లో వీటికి అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. మంత్రి ప్రతిపాదనలపై శతప్పన్ సానుకూలంగా స్పందించారు. ఏటా 30 వేల నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల కాఫీ క్యూరింగ్, గ్రీన్ బీన్ ట్రేడింగ్ సామర్థ్యం తమ సంస్థకు ఉందన్నారు. తమ సంస్థ ఆదాయంలో 80 శాతానికి పైగా విదేశీ మార్కెట్ల నుంచే వస్తోందని ఆయన వివరించారు. ఏపీ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు స్థానిక హస్తకళలకు భారీ మార్కెటింగ్ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వయం ఏపీ, లేపాక్షి బ్రాండ్ల ఉత్పత్తులను వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ సహా చైన్లలో చేర్చాలని మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదించారు. విశాఖలో వాల్‌మార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పాల్ డైక్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలోని స్థానిక కళాకారులు, మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు దేశీయంగా మంచి డిమాండ్ ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోనూ వాటికి అవకాశాలు కల్పించాలని కోరారు. సముద్ర ఆహారం, వస్త్ర రంగాల్లో పెట్టుబడులపైనా భాగస్వామ్యాలను అన్వేషించాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు ఇప్పుడు సువర్ణావకాశం


మొదటి పేజి తరువాయి



అవకాశాలు చాలా ఉన్నాయి. ప్రముఖంగా వినిపించే పదాలు డేటాసెంటర్లు, ఏరోస్పేస్. విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ వేదిక కానుంది. దేశంలోనే అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. అపార అవకాశాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైన ప్రాంతం. భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సాధించాలని లక్ష్యం పెట్టుకుంది. 500 గిగావాట్లలో 160 గిగావాట్లను ఆంధ్రప్రదేశ్ అందించబోతోంది. దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీకి రాష్ట్రం వేదిక కానుంది. భవిష్యత్తులో కొత్త సంస్కరణలకు తిరుపతి స్పేస్ సిటీ వేదిక కాబోతోంది. త్వరలో డ్రోన్ ఎయిర్‌టాక్సీలు రాబోతున్నాయి. 2024 జూన్ నుంచి 22.6 లక్షల కోట్లకు 714 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. 7.3 లక్షల కోట్లకు సంబంధించి 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్‌లో ఉన్నాయి. రెండున్నరేళ్లలో పెట్టుబడుల్లో పురోగతి సాధిస్తూ వచ్చాం. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అనంతపురం జిల్లా కియా సిటీ, కొరియన్ సిటీగా అభివృద్ధి చెందుతోంది. అనంతపురం ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచేందుకు అదనంగా పెట్టుబడులకు ముందుకొచ్చింది. కియా సిటీ విస్తరణ వల్ల ఇంకా చాలామందికి ఉపాధి లభిస్తుంది. కియా మోటార్స్ ఏపీకి వచ్చినప్పుడే అనుకూల వాతావరణం సృష్టించాం. ఒప్పందం కుదిరిన 14 నెలల్లోనే ప్లాంట్ నిర్మాణం, ఉత్పత్తి ప్రారంభమైంది" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "ప్రస్తుతం ఆరు ఆపరేషనల్ ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. అదనంగా మరో 9 ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు చర్యలు. దేశంలోనే ప్రధాన లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. రైల్వే, రోడ్లు, ఎయిర్‌పోర్ట, వాటర్ కనెక్టివిటీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. రాష్ట్రానికి హైస్పీడ్ రైళ్లు రాబోతున్నాయి. ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయబోతున్నాం. నదుల అనుసంధానాన్ని ప్రతిపాదించా అనేక రాష్ట్రాలు ముందుకొచ్చాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో నదుల అనుసంధానం ప్రాజెక్టు పూర్తవుతుంది. నదుల అనుసంధానం పూర్తయితే అభివృద్ధిని అడ్డుకునేవాళ్లు ఉండరు." - నారా చంద్రబాబు, ముఖ్యమంత్రి పెట్టుబడులకు చట్టపరమైన రక్షణ : ప్రభుత్వాలు మారినా రాజకీయ కక్ష సాధింపులకు పెట్టుబడులు బలికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబడుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కీలక ప్రతిపాదన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చట్టం రూపొందించి కేంద్రానికి పంపుతామని, దానికి ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ను కోరారు. రాష్ట్ర చట్టానికి ఆమోదంతో పాటు జాతీయ స్థాయిలోనూ ఇలాంటి చట్టం తీసుకొస్తే దేశ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

తెలంగాణాలో 21 మంది ఐపీఎస్ ల బదిలీలు..

మొదటి పేజి తరువాయి



లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో సమూల మార్పులు చేస్తూ పోస్టింగ్‌లు కేటాయించారు. ఈ బదిలీల్లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త సారథి వచ్చారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ సీపీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా (డీజీ) బదిలీ చేశారు. ఆయనకు అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు. అలాగే రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ నియమితులయ్యారు. ఆయనకు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలను కూడా ప్రభుత్వం కేటాయించింది.

బదిలీ అయిన 21 మంది ఐపీఎస్ అధికారులు - వారి కొత్త బాధ్యతలు:

1. మహేశ్ మురళీధర్ భగవత్ (1995 బ్యాచ్): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ 2. వీసీ సజ్జనార్: డీజీ (తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ & సివిల్ డిఫెన్స్), ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు 3. డా. సౌమ్య మిశ్రా (1994 బ్యాచ్): డీజీపీ (మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా), ఏడీజీపీ (ఆర్గనైజేషన్ & లీగల్)గా అదనపు బాధ్యతలు 4. స్వాతి లక్రా (1995 బ్యాచ్): జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు 5. చారు సిన్హా (1996 బ్యాచ్): ఏసీబీ డైరెక్టర్ జనరల్, సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు 6. డా. అనిల్ కుమార్ (1996 బ్యాచ్): టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ 7. వై. నాగిరెడ్డి (1997 బ్యాచ్): పౌరసరఫరాల శాఖ కమిషనర్ & ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ (+ లీగల్ మెట్రాలజీ) 8. విక్రమ్ సింగ్ మాన్ (1998 బ్యాచ్): గ్రేహౌండ్స్ & ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్), పోలీస్ హౌసింగ్ విభాగం 9. ఎం. స్టీఫెన్ రవీంద్ర (1999 బ్యాచ్): టీజీ-టీఎంఏఆర్ఎస్) డైరెక్టర్ 10. అకున్ సబర్వాల్ (2001 బ్యాచ్): అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్), కోఆర్డినేషన్ & టెక్నికల్ సర్వీసెస్ 11. సంజయ్ కుమార్ జైన్: అదనపు డీజీపీ (ట్రైనింగ్) - అదనపు బాధ్యతలు 12. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (2004 బ్యాచ్): డైరెక్టర్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) 13. కార్తికేయ (2006 బ్యాచ్): ఐజీ (మల్టీ జోన్-1), ఐసీసీసీ డైరెక్టర్ 14. కె. రమేష్ నాయుడు (2006 బ్యాచ్): రైల్వేస్ ఐజీ 15. డి. జోయల్ డేవిస్ (2010 బ్యాచ్): టీజీ-టీఎంఏఆర్ఎస్ రోడ్ సేఫ్టీ & ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా అదనపు బాధ్యతలు 16. జి. చందన దీప్తి (2012 బ్యాచ్): జోన్-7 (జోగులాంబ/గద్వాల) డీఐజీగా అదనపు బాధ్యతలు 17. ఆర్. భాస్కరన్ (2012 బ్యాచ్): డీఐజీ (ఇంటెలిజెన్స్) 18. కె. నారాయణ నాయక్ (2009 బ్యాచ్): జోన్-2 (బాసర) డీఐజీగా అదనపు బాధ్యతలు 19. ఎల్.ఎస్. చౌహాన్ (2009 బ్యాచ్): డీఐజీ (కోఆర్డినేషన్), జోన్-6 డీఐజీగా అదనపు బాధ్యతలు 20. శ్రీబాలా దేవి: టీజీ-టీఎంఏఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) 21. వి. అరవింద బాబు: హైదరాబాద్ సిటీ డీసీపీ (ఎస్ఎం & ఐటీ)

రూ.7 కోట్లు ఇవ్వకుంటే కేజ్రీవాల్ ను చంపేస్తాం'

దిల్లీ మాజీ సీఎంకు బిష్ణోయ్ గ్యాంగ్ వార్నింగ్!

మొదటి పేజి తరువాయి



నిందితుడిని పట్టుకోవాలని పోలీసులను కోరారు. ఇందుకోసం కాల్ డీటెయిల్ రికార్డులు ఐపీ లాగ్‌లు లొకేషన్ గుర్తించి సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, కేజ్రీవాల్ కు పూర్తి రక్షణ కల్పించేందుకు భద్రతా విభాగాలతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు, మొహాలీ పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్లు (దోపిడీ/వసూలు చేయడం, భయపెట్టడం, ఐటీ చట్టం) వంటి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

అమితాబ్ బచ్చన్ నివాసంతో పాటు పలు కీలక ప్రాంతాలకు బాంబు బెదిరింపులు

ఇదిలా ఉండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో మరోసారి బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపాయి. బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ నివాసంతో పాటు ముంబయి మేయర్ కార్యాలయం, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఇతర కీలక ప్రాంతాలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. ఆయా ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పేల

వైసీపీ కార్యకర్త లోకేష్ కుటుంబానికి

ఉషశ్రీ చరణ్ పరామర్శ




పెనుకొండ దరువు న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లోకేష్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లోకేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆమె, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి తన సానుభూతి, అండ ఉంటాయని భరోసా ఇచ్చారు.

మీ కలతోపాటు ఆంధ్రప్రదేశ్ కలను నిజం చేయడంలో భాగస్వాములు కండి



విజయనగరం, నవంబర్ 12: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టి పారిశ్రామికవేత్తలు తమ ఉన్నతమైన కలతో పాటు రాష్ట్ర భవిష్యత్తును నిజం చేయడంలో భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 31వ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) భాగస్వామ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 58 దేశాల నుంచి వందలాది మంది ప్రతినిధులు హాజరైన ఈ వేదికపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి భద్రత, భరోసా



ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, ఆగ్నేయాసియా దేశాలకు ఇది ముఖద్వారంగా నిలుస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇక్కడ అపారమైన మానవవనరులు, ఇన్నోవేషన్ ఆలోచనలు కలిగిన యువతకు కొదవలేదని తెలిపారు. కేవలం భారీ పెట్టుబడిదారులకే పరిమితం కాకుండా, చిన్నస్థాయి ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులను, గ్రామీణ ◌ెఐ గిరిజన ప్రాంతాల్లోనూ పెట్టుబడులను విస్తరించాలని ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే వేగంగా అనుమతులు ఇవ్వడానికి, అన్ని విధాలా సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సదస్సులో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, కింజారపు రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి నారా లోకేష్ తో ప్రత్యేకంగా సమావేశమైన పవన్ కళ్యాణ్, సదస్సు ద్వారా రాబోతున్న పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై చర్చించారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, ప్రకృతికి భంగం కలగకుండా పరిశ్రమలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆయన పారిశ్రామికవేత్తలను కోరారు..

విశాఖ సీఐఐ సదస్సుకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం



విజయనగరం, నవంబర్ 12: విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) భాగస్వామ్య ముగింపు సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు విజయనగరం జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. భోగాపురంలోని ఏఎస్ఆర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బుధవారం చేరుకున్న రాష్ట్ర గవర్నర్‌ను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జనగణన రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి




-ఫీల్డ్ ట్రైనర్లకు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దిశానిర్దేశం

పుట్టపర్తి, దరువు న్యూస్: జిల్లాలో చేపట్టనున్న జనగణన రెండో దశ ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ ప్రగతి, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో జనగణన గణాంకాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర అత్యంత ముఖ్యమైనదని, వారు తదుపరి దశలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జనగణన మార్గదర్శకాలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జనగణన రెండో దశ షెడ్యూల్ ప్రకారం జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించనున్నారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు సేకరించిన వివరాల పునఃపరిశీలన నిర్వహిస్తారు. జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి సంబంధించిన ఖచ్చితమైన, వాస్తవ సమాచారాన్ని సేకరించి విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించడమే లక్ష్యమన్నారు. జనగణన కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలందరూ సరైన సమాచారం అందించి పూర్తి సహకారం అందించాలని కోరారు. శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనర్లు తదుపరి సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చి, క్షేత్రస్థాయిలో జనగణన ప్రక్రియ సజావుగా జరిగేలా చూడనున్నారు.

పశుగ్రాసం కొరతపై సీఎం చంద్రబాబు తక్షణ స్పందన



రాష్ట్ర సచివాలయం, దరువు న్యూస్: ఎల్‌నినో ప్రభావంతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఏర్పడిన పశుగ్రాసం కొరతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి మేరకు కొరత ఉన్న ప్రాంతాలకు వెంటనే మేత సరఫరా చేయాలని



అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రూ.కోటి విలువైన 250 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని తక్షణమే సరఫరా చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర తెలిపారు. నవంబర్ 10న జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పశువులకు మేత అందకపోతే రైతులు, పశుపోషకులు ఇబ్బందులు పడతారని, పశుసంపదను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల సమీక్షలో రెండు జిల్లాల్లో కలిపి సుమారు 11.04 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం కొరత ఉన్నట్లు గుర్తించారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని 363 రెవెన్యూ గ్రామ సచివాలయాల పరిధిలో 2,19,055 మెట్రిక్ టన్నుల కొరత ఉండగా, అనంతపురం జిల్లాలోని 293 సచివాలయాల పరిధిలో 8,84,893 మెట్రిక్ టన్నుల లోటు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కొరత తీవ్రతను బట్టి ఎండుగడ్డి, పచ్చిగడ్డి, పశుదాణా సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పశుగ్రాసం కొరతపై పశు పోషకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ భరోసా ఇచ్చారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణమే లక్ష్యం

పుట్టపర్తి, దరువు న్యూస్: త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలకు భద్రతపై భరోసా కల్పిస్తున్నారు. ప్రాదేశిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడటంపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా సున్నితమైన, సమస్యాత్మక గ్రామాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామసభలు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలు, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసులకు సహకరించాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు




అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల సమయంలో పాత కక్షలు, రాజకీయ విభేదాలను మనసులో పెట్టుకుని గొడవలు, ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలందరూ సంయమనం పాటిస్తూ, పరస్పర సహకారంతో ప్రశాంత



వాతావరణాన్ని కాపాడుకోవాలని పోలీసులు సూచించారు. ప్రతి గ్రామంలో ప్రశాంతత, ప్రజలకు భద్రత కల్పించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.


వైఎస్ జగన్‌ను కలిసిన 'చవ్వా'

అనంతపురం, నవంబర్ 12, దరువు న్యూస్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చిత్తూరు జిల్లా వైసీపీ పరిశీలకులు, సీనియర్ నాయకులు చవ్వా రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం, భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు చవ్వా రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చవ్వా రాజశేఖరరెడ్డిని అభినందించారు. అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ స్థానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్కించుకోవడంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక శ్రేణుల సమిష్టి కృషి కీలకంగా నిలిచిందని పేర్కొన్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తల భాగస్వామ్యం, క్షేత్రస్థాయిలో చేసిన ప్రయత్నాలు విజయానికి దోహదపడ్డాయని అభిప్రాయపడినట్లు తెలిపారు. వైఎస్ జగన్‌తో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా పార్టీ ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించామని చవ్వా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. పార్టీ అధినేత సూచనలకు అనుగుణంగా నాయకులు,



కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన ధర్మవరం యువకుడికి మెరుగైన వైద్యం అందించాలి



ధర్మవరం, దరువు న్యూస్: అన్నమయ్య జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం పట్టణం శాంతినగర్‌కు చెందిన మోహనకృష్ణ (23) తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించారు. మదనపల్లిలో చికిత్స పొందుతున్న యువకుడితో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి మోహనకృష్ణకు అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పాలని తన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబుకు ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు హరీష్ బాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు, టీడీపీ నాయకుడు రాళ్లపల్లి బాబుతో కలిసి



శాంతినగర్‌లోని మోహనకృష్ణ నివాసానికి వెళ్లారు. ఆయన తల్లిదండ్రులను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును, యువకుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మోహనకృష్ణకు మెరుగైన వైద్యం అందుతోందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంత్రి సత్యకుమార్ యాదవ్ కుటుంబానికి అండగా ఉంటారని హరీష్ బాబు భరోసా ఇచ్చారు. యువకుడికి మెరుగైన వైద్యం అందించే విషయంలో మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.



అనంత మేయర్ ఓటమిపై 'పోస్ట్ మార్టం'!





- ఎమ్మెల్యే దగ్గుపాటిని నియంత్రించడంతోనే ఈ చేదు ఫలితాలా?
- మెజార్టీ కార్పొరేటర్లు గెలిచి మేయర్ వైకాపా గెలుపుపై అంతర్మథనం
- ఏమాత్రం పట్టులేని బిజెపికి ఏకంగా ఆరు స్థానాలు
- ఒక్క స్థానంలో పోటాపోటీ మెజారిటీతో గెలుపు

అనంతపురం, నవంబర్ 12, దరువు న్యూస్ :

అనంతపురం నగరంలో 62 కార్పొరేషన్లు ఉన్నాయి.. అందులో 15 జనసేన, 9 బీజేపీకి కార్పొరేట్ స్థానాలు కేటాయించాలని అనంత ఎన్నికల ఇన్‌చార్జ్ ఏరాసు ప్రతాపరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు స్పష్టం చేశారు. అధిష్టానం నుండి తమకు ఆదేశాలు అందాయని ఎమ్మెల్యే దగ్గుపాటికి ఖరాఖండిగా తేల్చి చెప్పారు. కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గుపాటి ప్రసాద్ స్థాన బలం ఉన్నవారికి మాత్రమే కార్పొరేటర్ టికెట్లు కేటాయించాలని ఒత్తడి తెచ్చిన వారు మాత్రం, అధిష్టానం ఆదేశాలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

▸▸మైనార్టీలకు మొదటి నుండి పెద్దపీట వేస్తూ.. సీఎం రిలీఫ్ ఫండ్‌లో సింహభాగం మైనార్టీలకు అందేలా చేయడంలో పాటు మైనార్టీలు ఏ సమస్యపై వచ్చిన వాటి పరిష్కారం విషయంలో దగ్గుపాటి ప్రసాద్ ముందున్నారు. దీంతో మైనార్టీల ఓట్లు గంప గుత్తుగా టీడీపీకి పడే అవకాశాలు ఉన్నాయని ఆయన టీడీపీ పెద్దలతో వాదించారు. మేయర్ బీజేపీకి ఇచ్చినా కార్పొరేటర్ స్థానాలు టీడీపీకి ఇస్తే, సులభంగా మేయర్ స్థానాన్ని కైవశం చేసుకోవచ్చని దూతలకు చెప్పినా వారు ఆయన మాటలను పెడచెవిన పెట్టినట్లు స్థానిక కార్పొరేటర్లు గుసగుసలాడుతున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి తదితర మున్సిపాలిటీల్లో కేవలం ఒకటి రెండు స్థానాలకే మిత్రపక్షాలను ఎమ్మెల్యేలు పరిమితం చేశారని అధిష్టాన దూతలకు ఎమ్మెల్యే ఎంత నచ్చ చెప్పాలని చూసినా వారు వినుకోలేదు.

▸▸చివరకు బలమైన అభ్యర్థులు ఉన్నచోట స్థానికేతరులకు, మిత్రపక్షాలకు అధిష్టాన దూతలు కేటాయించడంతో రెబల్స్ బెడద, వైకాపా అభ్యర్థుల నుండి ఎన్నికల్లో గట్టి పోటీ ఎదురైంది. నగరంలో ఏమాత్రం పట్టులేని బీజేపీ పోటీ చేసిన ఆరు స్థానాల్లో కేవలం ఒక్కరు మాత్రమే కార్పొరేటర్‌గా విజయం సాధించారు. ఆ డివిజన్లలో టీడీపీ రెబల్స్ పెద్ద సంఖ్యలో విజయం సాధించారు. దీనికి తోడు టిడిపికి ఆయువుపట్టుగా ఉన్న మైనార్టీలు కార్పొరేటర్ కు మాత్రం టిడిపికి ఓటు వేసి, మేయర్‌కు వైకాపాకు ఓటు వేశారు. దీంతో మేయర్ అభ్యర్థిగా వైకాపా తరపున పోటీ చేసిన రమేష్ గౌడ్ సునాయాస విజయం సాధించారు.

అనంతపురం మేయర్ పీఠాన్ని దాదాపు 6వేల మెజార్టీతో వైసీపీ కైవశం చేసుకుంది. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్ మేయర్లు గెలిచిన కూటమి అనంతపురంలోనే ఎందుకు ఓటమి పాలు అయిందని విషయంలో పార్టీ లోని పెద్దలు పోస్ట్ మార్టం చేస్తున్నారు. ఏకంగా కూటమి 37 కార్పొరేటర్ స్థానాలను గెలుచుకున్నా.. టీడీపీ కూటమి, మేయర్ పదవి మాత్రం వైసీపీ అభ్యర్థి రమేష్ గౌడ్ గెలుచుకోవడం వెనుక మర్మం ఏమిటి.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చివరి రెండు రోజుల్లో అంతా తానై ఎన్నికల నిర్వహణ బాధ్యత తీసుకోవడంతోనే మెజార్టీ కార్పొరేట్ ఫలితాలు వచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే..

తిలాపాపం తలా పిడికెడు

బీజేపీ అభ్యర్థిగా ఎంపిక చేసిన అజేష్ యాదవ్‌ను ఎన్నికల ప్రచార హోదాలో నిలవడంలో బీజేపీ నాయకత్వం విఫలమైంది. పార్టీలకు అతీతంగా బీసీలలో బలమైన నాయకుడిగా వైకాపా తరపున పోటీ చేస్తున్న రమేష్ గౌడ్‌కు పోటీగా స్థానికంగా చిరపరిచితుడైన బీజేపీ నాయకుడిని ఎంపిక చేయకుండా.. మంత్రి తన అనుచరుడైన అజేష్ యాదవ్‌ను ఎంపిక చేశారు. వారి కుటుంబం మొదటి నుండి కమ్యూనిస్టు పార్టీ నేపథ్యం ఉండడంతో, బిజెపి నాయకులు సైతం మనస్ఫూర్తిగా మేయర్ గెలుపుకు పని చేయలేదని స్పష్టమవుతోంది. అజేష్ యాదవ్‌ను ఎప్పుడు కుల సంఘాల సమావేశాలకు పరిమితం చేస్తూ, గెలుపు పై కాకి లెక్కలు వేసుకుంటూ బీజేపీ నాయకులు కాలం వెళ్లదీసినట్లు విమర్శలు వస్తున్నాయి. మంత్రి సత్యకుమార్ సన్నిహితులుగా పేరెందున వారెవరూ ప్రజలలో ఏమాత్రం పట్టులేని నాయకులు. వారి మాటలు వేద వాక్కుగా పాటించడంతోనే ఎన్నికల రణ రంగంలో ఈ దుస్థితి దాపురించిందని ఏళ్ల తరబడి బీజేపీ పల్లకి మోసే నాయకులు వాపోతున్నారు.

▸▸ఎమ్మెల్యే ఎన్నికల రోజున ఎమ్మెల్యే దగ్గుపాటి పోల్ మేనేజ్మెంట్ చేయడంతోనే కూటమి పరువు ఈ మాత్రం అయినా నిలిచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆయన ఎన్నికల రోజున అన్ని బూత్‌లు తిరుగుతూ టీడీపీ కార్యకర్తలకు ధైర్య వచనాలు చెబుతూ, వైకాపా నాయకుల ఆగడాలను అడ్డుకట్ట వేయడం వల్లే మెజార్టీ కార్పొరేట్ స్థానాలు కైవశం అయ్యాయని కార్పొరేటర్లుగా ఎన్నికైన వారు బహిరంగంగానే చెబుతున్నారు. ఎమ్మెల్యే ప్రసాద్‌కు అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచార విషయంలో ఫ్రీ హ్యాండ్ ఇచ్చి ఉంటే ఫలితాలు మరో విధంగా ఉండేవని అభిప్రాయాన్ని స్థానిక నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ డిప్యూటీ మేయర్ పదవి టీడీపీ, జనసేన అభ్యర్థులలో ఎవరికి దక్కుతుందో నన్న ఉత్కంఠ కూటమి వర్గాల్లో నెలకొంది.









పంచాయతీ ఎన్నికలకు అదే మండలం లేదా ప్రక్కన మండలానికి కేటాయించాలి : ఎస్టీయూ




అనంతపురం, నవంబర్ 12, దరువు న్యూస్ :

జిల్లాలో ప్రస్తుతం జరగబోయే పంచాయతీ ఎన్నికలకు అదే మండలం లేదా ప్రక్క మండలానికి కేటాయించాలని డీపీఓ కార్యాలయం ఏఓకి వినతిపత్రం అందజేశారు. అలాగే విధులలో పాల్గొనే సిబ్బందికి పీఓ, ఏపీఓలకు ఈనెల 15వ తేదీ, 22వ తేదీ వరుస ఆదివారాలలో శిక్షణా కార్యక్రమాలకు హాజరు కావాలని ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. వరుస పని దినాలు కావడం ఉపాధ్యాయులను, ఉద్యోగులను తీవ్ర ఇబ్బందికి గురి చేయడం మంచి పరిణామం కాదని, శిక్షణా కార్యక్రమాలు ఆదివారాలు కాకుండా పని దినాలలో నిర్వహించాలని కోరారు. అలాగే తీవ్ర అనారోగ్య కారణాలతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని, గర్భిణీ స్త్రీలను, చంటి బిడ్డల తల్లులను ఎన్నికల విధులనుండి పూర్తిగా మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వి.రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణ, నాయకులు నిట్టూరు చంద్ర శేఖరరావు, రవీంద్రరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వీరాంజనేయులు, నాగేంద్రలు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల ప్రత్యేక టెట్ ఫలితాలకు ఆటంకం కలిగించవద్దు : ఎస్టీయూ

అనంతపురం, నవంబర్ 12, దరువు న్యూస్ :



ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ను ప్రభుత్వం నిర్వహించడం మంచి పరిణామమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు ప్రకటించుటకు ఆటంకం కలిగించకూడదని తెలిపారు. దాదాపు 30 నుంచి 31 సంవత్సరాలు బోధన వృత్తిలో అంభవం కలిగి డీఎస్సీ పరీక్షలు వ్రాసి ఉద్యోగం పొందిన వారికి ప్రభుత్వం ప్రత్యేక టెట్‌కు అవకాశం కల్పించిందని దానిని ఉపాధ్యాయులు స్వాగతించారని ఫలితాలు ప్రకటించుటకు ఆటంకాలు కలిగించకూడదన్నారు. 31 సంవత్సరాలు అనుభవం కలిగి ఉన్న ఉపాధ్యాయులు నిత్యం బోధనలో నిమగ్నమై ప్రిపేర్ కావడానికి సరైన సమయం లేకపోవడం ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు కుటుంబానికి సేవ చేస్తూ తమ వృత్తికి న్యాయం చేకూరుస్తూ టెట్ ప్రిపరేషన్‌కు సమయం కేటాయించడం చాలా కష్టంతో కూడుకున్న పని. కాబట్టి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ కు అవకాశం కల్పించి పరీక్షలు నిర్వహించడం మంచి పరిణామం. దీనిని అడ్డుకోవడం మంచి పరిణామం కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి కోరారు.

మంగళగిరిలో మేయర్ రమేష్ గౌడ్‌కు ఘన సన్మానం

మంగళగిరిలో గౌడ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ, గౌడ సంఘాల ఆత్మీయ సమ్మేళనం





అనంతపురం నగర మేయర్‌గా ఎన్నికైన రమేష్ గౌడ్‌ను బీసీ ప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. హేమా మురళి గౌడ్, కుక్కల రాంప్రసాద్ గౌడ్, మోర్ల వెంకటకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో, కాగిత స్వాతి గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అనుమోలు ఏడుకొండలు, మోర్ల ఏడుకొండలు, కొల్లూరి హనుమంతరావు, మొఖరాల రాము, తుళ్లూరి సూరిబాబు, మారగాని చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం, నవంబర్ 12, దరువు న్యూస్ :

సెల్‌ఫోన్ వద్దు.. క్రీడలు ముద్దు : ఎస్ఐ రాఘవేంద్రప్ప

రాయలసీమ జోనల్ తైక్వాండో పోటీలలో ప్రతిభ చాటిన ఆదర్శ విద్యా నికేతన్ విద్యార్థులకు అభినందన





పెద్దవడుగూరు, నవంబర్ 12, దరువు న్యూస్ :

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువు తోపాటు క్రీడలలో కూడా రాణించాలని పెద్దవడుగూరు ఎస్ఐ రాఘవేంద్రప్ప పిలుపునిచ్చారు. రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

గోల్డ్ మెడల్ (బంగారు పతకం) : కరణం సహస్ర ప్రగ్యు.హర్షిత సాయి రెడ్డి. **సిల్వర్ మెడల్ (రజత పతకం) :** బండారు రాకేష్, చాకలి పవన్ కుమార్. **బ్రాంజ్ మెడల్ (కాంస్య పతకం) :** షేక్ చాంద్ బాషా, కరణం అనిరుద్, బి.చక్రధర్ రెడ్డి.

పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఐ రాఘవేంద్రప్ప విజేతలకు సర్టిఫికెట్లు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. క్రీడల వల్ల విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని తెలిపారు. ఒలంపిక్స్‌లో గల ఆత్మరక్షణ విద్య అయిన తైక్వాండోలో విద్యార్థులు రాణించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ కె.నారాయణరావు, ఉపాధ్యాయ బృందం కలిసి ఎస్ఐ రాఘవేంద్రప్పకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కరణం నారాయణరావు వైస్ ప్రిన్సిపాల్ కరణం మాధుర్యలహరి తైక్వాండో మాస్టర్ తలారి తులసిరామ్ ఉపాధ్యాయులు జె.పరమేశ్వర్, జె.దీప్తి, బి.ఆదిలక్ష్మి, ఎన్.వసుంధరదేవి, ఎ.మమత, డి.దస్తగిరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమతెరలు పంపిణీ



పామిడి, నవంబర్ 12, దరువు న్యూస్ :

పామిడి మండలంలోని ఎస్సీ హాస్టల్, మోడల్ స్కూల్ హాస్టల్, కేజీబీవీ హాస్టల్‌లో ఉన్నటువంటి విద్యార్థులకు నేషనల్ హెల్త్ మిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గురువారం పీహెచ్‌సీ ఎద్దులపల్లి వైద్యాధికారి డాక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో 'దోమతెరలు పంపిణీ కార్యక్రమం' నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఈ దోమతెరలు మెడికేటెడ్ దోమతెరలు అని, అలాగే నాలుగు సంవత్సరాల వరకు ఉపయోగించుకోవచ్చని డాక్టర్ సుధాకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, గుత్తి సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రభాకర్, సూపర్‌వైజర్స్ అయినటువంటి శ్రీరామ్‌రెడ్డి, సుధాకర్, మెల్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.